


'పీఎంశ్రీ' స్కూళ్లకు యూనిఫాం నిధులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 6 : ప్రైమినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం నిమిత్తం నిధులు మంజూరయ్యాయి. పీఎంశ్రీ కింద సంగారెడ్డి జిల్లాలో 25 పాఠశాలలు ఎంపికైన విషయం తెలిసిందే. ఇందులో 19 పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో విద్యార్థికి జత యూనిఫాం కోసం రూ. 50 చొప్పున రూ.9,07,100 నిధులు మంజూరయ్యాయి. మిగిలిన ఆరు పాఠశాలలకు త్వరలో నిధులు వస్తాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

అభ్యర్థుల కోసం అన్వేషణ



కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో తర్జనభర్జన.. బీజేపీలో పోటాపోటీ

ఉమ్మడి మెదక్ జిల్లాలో లోక్‌సభ ఎన్నికలకు ప్రధాన పార్టీల కసరత్తు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి మార్చి 6 : ప్రత్యేక రాష్ట్రం వచ్చిన నాటి నుంచి దాదాపు పదేళ్ల అధికారంలో ఉన్న పార్టీ ఒకటి.. తాజాగా అధికారంలోకి వచ్చిన పార్టీ మరొకటి... ఈ రెండు పార్టీలు ఉమ్మడి జిల్లాలో లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ఎంపికపై మల్లగుల్లాలు పడుతున్నాయి. మెదక్, జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల కోసం అన్వేషణ సాగిస్తున్నాయి. ప్రత్యర్థులను ఎదుర్కొని విజయం సాధించడానికి అవసరమైన అంగబలం, అర్థబలం ఉన్నవారిని ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నాయి. మరోవైపు కేంద్రంలో మరోసారి అధికారంపై ఆశలు పెట్టుకున్న బీజేపీలో మాత్రం టికెట్ కోసం పోటాపోటీ నెలకొన్నది. ఆశావహులు ఎక్కువ కావడం కమలం పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారింది.

మెదక్ నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

బీఆర్ఎస్ ఆధిపత్యం కొనసాగుతున్న మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అభ్యర్థిత్వం దాదాపు ఖరారయినట్టేనని తెలుస్తున్నది. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్ నుంచి సంకేతాలు రావడంతో ప్రతాప్‌రెడ్డి గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో ప్రచారం మొదలుపెట్టారు. ఇక, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు సరైన అభ్యర్థి కోసం వెతుకుతున్నది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో పాటు పటాన్‌చెరుకు చెందిన బీసీ నాయకుడు నీలం మధు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. మైనంపల్లి హన్మంతరావు గతంలో మెదక్, మల్కాజ్‌గిరిల నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్‌రావు మెదక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. నియోజకవర్గంలో విస్తృత పరిచయాలు ఉన్నందున తనకు విజయావకాశాలుంటాయని ఆయన పార్టీ నాయకత్వానికి వివరించినట్టు తెలిసింది. నీలం మధు గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పటాన్‌చెరు టికెట్ ఆశించారు. ఈ పార్టీ టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. అక్కడా టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీలో చేరి పోటీచేసి ఓడిపోయారు. ఎన్నికల అనంతరం తిరిగి కాంగ్రెస్‌లో చేరిన మధు పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ నుంచి టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు.

మెదక్ బీజేపీలో టికెట్ లొల్లి

మెదక్ పార్లమెంట్ అభ్యర్థి ఎంపిక బీజేపీలో చిచ్చురేపుతున్నది. పార్టీ టికెట్ తనకే వస్తుందన్న నమ్మకంతో మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు ప్రచారం చేసుకున్నారు. గజ్వేల్ ప్రాంతానికి చెందిన నాయకుడు గురువారెడ్డి కూడా వాల్‌పోస్టర్లు, సోషల్‌మీడియా ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. మరోవైపు, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. వీరు ముగ్గురూ కాకుండా ఇటీవల బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన గోదావరి భర్త, పారిశ్రామికవేత్త అంజిరెడ్డి కూడా పార్టీ టికెట్ కోసం పట్టుబడుతున్నారు. అందుకే మొన్న జరిగిన ప్రధాని నరేంద్రమోదీ సభను ఆయన పటేల్‌గూడలోని తన భూమిలోనే జరిపించారు. జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ ఆశించిన మాజీ కేంద్రమంత్రి, దివంగత ఆలె నరేంద్ర కుమారుడు ఆలె భాస్కర్ సైతం మారిన పరిస్థితుల నేపథ్యంలో మెదక్ పార్లమెంట్ టికెట్‌ను ఆశిస్తున్నారు. జహీరాబాద్ టికెట్ బీబీ పాటిల్‌కు దక్కడంతో మెదక్ స్థానమైనా తనకు కేటాయించాలని ఆయన పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తున్నది. తాజాగా, బీఆర్ఎస్‌కు చెందిన చెవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని కూడా బీజేపీ పరిశీలిస్తున్నట్టు వార్తలు రావడం ఆ పార్టీలో కలకలం రేపుతున్నది. ఆయన బీజేపీలో చేరి మెదక్ టికెట్ పొందవచ్చని పార్టీలో ఊహాగానాలు సాగుతున్నాయి. దీంతో, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల కంటే బీజేపీలో మెదక్ టికెట్‌కు పోటీ ఎక్కువగా ఉన్నది.

జహీరాబాద్ నుంచి గాలి అనిల్‌కుమార్?

సిట్టింగ్ ఎంపీ పార్టీ మారడంతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు అభ్యర్థి ఎంపిక కష్టంగా మారింది. ఆ పార్టీ నుంచి వరుసగా రెండుసార్లు ఎంపీగా గెలిచిన బీబీపాటిల్ ఇటీవల బీజేపీలో చేరి.. ఆ పార్టీ టికెట్ దక్కించుకున్నారు. దీంతో అభ్యర్థి ఎంపికపై బీఆర్ఎస్ మల్లగుల్లాలు పడుతున్నది. ఈ నేపథ్యంలో పటాన్‌చెరుకు చెందిన గాలి అనిల్‌కుమార్‌ను జహీరాబాద్ నుంచి బరిలో దింపాలని గులాబీ పార్టీ నాయకత్వం యోచిస్తున్నట్టు తెలిసింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ తరఫున మెదక్ నుంచి పార్లమెంట్‌కు పోటీచేసి ఓడిపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి టికెట్ ఆశించి భంగపడడంతో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంతో సంబంధాలు లేకపోయినా.. నాయకత్వం ఆయనను ఎంపిక చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో సుమారు 1.25 లక్షల మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన ఓట్లు ఉండడంతో అదే సామాజికవర్గానికి చెందిన అనిల్‌కుమార్ వైపు బీఆర్ఎస్ మొగ్గు చూపుతున్నది. దీనికితోడు ఆర్థికంగా బలంగా ఉండడం కూడా అనిల్‌కుమార్ వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణమని తెలుస్తున్నది. అయితే, పార్టీకి చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు గాలి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. నియోజకవర్గంలో రెండున్నర లక్షలకుపైగా లింగాయత్ సామాజికవర్గం ఓట్లున్నాయని.. కాంగ్రెస్, బీజేపీలు ఆ సామాజికవర్గ అభ్యర్థులనే పోటీలో దింపుతున్నాయని గుర్తుచేస్తున్నారు. లింగాయత్ అభ్యర్థినే పోటీలో నిలబెడితే గెలిచే అవకాశాలుంటాయని వారు తమ అభిప్రాయాలను పార్టీ నాయకత్వం ముందుంచుతున్నట్టు తెలిసింది. మరోవైపు, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ అభ్యర్థిత్వం ఖరారయినట్టేనని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

అధిక వడ్డీ ఆశ చూపించి.. రూ. కోట్లలో మోసం

డబ్బు చెల్లిస్తానని.. వాయిదాకు ఒక రోజు ముందు కుటుంబంతో అదృశ్యం

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

తూప్రాన్, మార్చి 6: చిట్టీలు నడుపుతూ, గృహరుణాలు ఇప్పిస్తూ నమ్మకంగా మెసులుకున్న వ్యక్తి.. అధిక వడ్డీ ఆశ చూపించి రూ. కోట్లలో వసూలు చేసి అదృశ్యమైన ఘటన తూప్రాన్‌లో వెలుగుచూసింది. ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద రూ. లక్షల్లో తీసుకుని, మంగళవారం చెల్లింపులు చేస్తానని వాయిదా పెట్టి.. ఒకరోజు ముందు నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ పట్టణానికి చెందిన బిజిలిపురం యాదగిరి (37) ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ చిట్టీలు నిర్వహించేవాడు. రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు చిట్టీలను నాలుగైదేళ్లుగా నమ్మకంగా నిర్వహిస్తున్నాడు. అలాగే, గ్రామకంఠం భూములకు గృహరుణాలు ఇప్పిస్తున్నాడు. చిట్టీలు వేసినవారికి డబ్బులు ఇవ్వకుండా అధిక వడ్డీ ఆశ చూపి వాడుకోవడం మొదలుపెట్టాడు. అలాగే గృహరుణాలు ఇప్పించి వచ్చిన డబ్బును కూడా అధిక వడ్డీ ఇస్తానని తీసుకునేవాడు. నూటికి రూ.5 నుంచి రూ. 20 వరకు వడ్డీ ఇస్తాననడంతో పలువురు పెద్దమొత్తంలో డబ్బులు ఇచ్చారు. అంతేకాకుండా వడ్డీకి డబ్బు ఇప్పించేందుకు మధ్యవర్తులను నియమించుకుని వారికి కమీషన్ ఇస్తున్నాడు. డబ్బులు ఇచ్చినవారి నుంచి ఒత్తిడి పెరగడంతో మంగళవారం డబ్బులు ఇస్తానని పలువురికి వాయిదా పెట్టాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం పెద్దగుట్టకు వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి భార్య, ఇద్దరు పిల్లలతో అదృశ్యమయ్యాడు. యాదగిరి తల్లి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. విషయం పత్రికల్లో రావడంతో బుధవారం బాధితులు పెద్దఎత్తున పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఇప్పటివరకు 46 మంది నుంచి రూ.7 కోట్ల వరకు మోసపోయినట్లు ఫిర్యాదులు వచ్చాయని పోలీసులు తెలిపారు. కాగా, పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారి సంఖ్య గంటగంటకు పెరుగుతుండడంతో బాధితుల సంఖ్య వందకు పైగా ఉంటుందని.. రూ.35 కోట్ల వరకు మోసం చేసిఉండవచ్చని ప్రచారం జరుగుతున్నది.

నా కొడుకు రూ.75 లక్షలు ఇచ్చాడు

యాదగిరి తమ్ముడికి నా కూతురిని ఇచ్చాము. భూమి అమ్మగా వచ్చిన రూ.75 లక్షలు నా కొడుకు నాగరాజు వద్ద తీసుకున్నాడు. అల్లుడి వద్ద రూ. 10లక్షలు తీసుకున్నాడు. ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద రూ. లక్షల్లో తీసుకున్నట్టు చెప్పుకుంటున్నారు. మా డబ్బులు తిరిగి వస్తాయో.. లేదోనని ఆందోళనగా ఉన్నది.

\- బాలమణి, ప్రజ్ఞాపూర్

మెదక్ కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ బాధ్యతల స్వీకరణ

మెదక్, మార్చి 6 : మెదక్ కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అదిలాబాద్ జిల్లా నుంచి ఆయన బదిలీపై మెదక్‌కు వచ్చారు. ఉదయం 10.30కు కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని ఐడీవోసీ కార్యాలయంలో సీటీసీపై సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పలువురు జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్, ఆర్డీవో రమాదేవి, కలెక్టర్ కార్యాలయ ఏవో. యూసుఫ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, పీఆర్ ఈఈ నర్సింహులు, మైనింగ్ ఏడీ జయరాజ్‌తో పాటు పలువురు కలెక్టర్‌ను కలిశారు. అనంతరం ఆయన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతి, ప్రజాపాలన అమలుతీరు, ధరణి, తాగునీటి సమస్య, ఏడుపాయల జాతర, వైద్యారోగ్యం, వ్యవసాయం, విద్య, భూసేకరణ, ప్రజావాణి తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.



కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఆహ్వానిస్తున్న అదనపు కలెక్టర్ రమేష్

విధులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

మెదక్ అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా అధికారులు కృషి చేయాలని, విధులను నిర్లక్ష్యం చేసేవారిని ఉపేక్షించబోనని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న ఆయన బుధవారం సాయంత్రం శాఖలవారీగా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అవినీతి రహిత పాలనే లక్ష్యంగా.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విధులు నిర్వహించాలని సూచించారు. పారిశుధ్యం, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని, మండలానికో గ్రామ పంచాయతీని ఎంపికచేసి అక్టోబరు 2 వరకు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. ధరణిలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాలమేరకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. డీఆర్‌డీఏ, జడ్పీసీఈవో, డీపీవో, డీఈవో, డీఎంహెచ్‌వో, జిల్లా సంక్షేమ శాఖలతో పాటు ప్రాధాన్యత ఉన్న శాఖల సమగ్ర కార్యచరణ ఈ నెల 15 వరకు తనకు అందజేయాలని ఆదేశించారు. వారంలో మరోసారి అధికారులతో సమావేశమవుతానని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొలం గట్టుపై పాము

కొడిపల్లి, మార్చి 6: ఓ నాగుపాము ఓ రైతు వ్యవసాయ క్షేత్రం వద్ద తరచూ వచ్చి పోతోంది. నాలుగు రోజులకోసారి అతడు పనిచేసే వ్యవసాయక్షేత్రం వద్దకు వచ్చి గంటసేపు ఉండి తిరిగి అడవిలోకి వెళ్లిపోతుంది. సంవత్సరం నుంచి ఈ వింత ఘటన మెదక్ జిల్లా కొడిపల్లి మండల పరిధిలోని బుజరంపేట శివారులో జరుగుతున్నది. హైదరాబాద్‌కు చెందిన జీవన్‌రెడ్డికి బుజరంపేట గ్రామ పరిధిలో 14 ఎకరాల భూమి ఉంది. గ్రామానికి చెందిన కర్నె హరీష్‌రెడ్డి ఈ వ్యవసాయక్షేత్రంలో కొంతకాలంగా పనిచేస్తున్నాడు. మామిడితోటతో పాటు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నాడు. సంవత్సరం క్రితం పొలం వద్ద చెట్టుపై పెద్ద నాగుపాము పడగ విప్పి కనిపించడంతో నమస్కారం చేశాడు. ఎలాంటి హానీ చేయకుండా వదిలేశాడు. అప్పటి నుంచి నాలుగైదు రోజులకోసారి పాము అదే ప్రాంతానికి వచ్చి చెట్లపై గంటసేపు వరకు ఉండి పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోతుంది.

ఎవరికీ హాని చేయలేదు



సంవత్సరం నుంచి నాలుగైదు రోజులకోసారి పక్కనే ఉన్న అడవి నుంచి పెద్ద నాగుపాము వస్తుంది. పడగవిప్పి కొంతసేపు ఉండి తిరిగి అడవిలోకి వెళ్లిపోతుంది. ఇప్పటివరకు ఎవరికి ఎలాంటి హానీ చేయలేదు. వారం రోజుల క్రితం పంట కోసం వేసిన కంచెలో చిక్కుకుపోవడంతో పామును రక్షించాను.

\- హరీష్‌రెడ్డి, బుజరంపేట



మెకానిక్ షెడ్‌లో అగ్నిప్రమాదం..

ఎనిమిది కార్లు దగ్ధం

నారాయణఖేడ్, మార్చి 6: మెకానిక్ షెడ్డులో ఓ కారులో పేలుడు జరిగి మంటలు విస్తరించడంతో ఎనిమిది వాహనాలు దగ్ధమైన ఘటన నారాయణఖేడ్‌లో బుధవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. సమీపంలోనే రెండు పాఠశాలలు ఉండడంతో పేలుడు శబ్దానికి విద్యార్థులు, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ఖేడ్ పట్టణంలోని కరస్‌గుత్తి రోడ్డు పక్కన విజ్ఞాన్ పాఠశాల, కాకతీయ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న మోయిద్‌ఖాన్‌కు సంబంధించిన మెకానిక్ షెడ్డులో మధ్యాహ్నం ఓ కారుకు మరమ్మతు పనులు చేస్తుండగా ఇందన ట్యాంకు పేలడంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో షెడ్డులో నిలిపిన ఎనిమిది కార్లు తగలబడడంతో దట్టమైన పొగ వ్యాపించింది. ఓ కారు గ్యాస్ ట్యాంకు 200 మీటర్ల దూరంలో ఉన్న పశువులపాక వద్ద పడింది. ప్రమాదంలో రెండు కార్లు, జీపు పూర్తిగా.. రెండు కార్లు, నాలుగు జీపులు పాక్షికంగా దగ్ధమయ్యాయి. వాటి ఇందన ట్యాంకులు పేలడంతో భయానక వాతావరణం నెలకొన్నది. కారు అద్దాలు పగిలి వాహనంపై వెళ్తున్న వ్యక్తికి తగలడంతో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఎదురుగా ఉన్న ఓ పాఠశాల యాజమాన్యం విద్యార్థులను దూరప్రాంతానికి తరలించింది. స్థానికుల సమాచారం మేరకు స్థానిక అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పారు. షెడ్డు పక్కనే ఉన్న ఫ్యాబ్రికేటర్ దుకాణంలోని షెడ్డుతో పాటు విద్యుత్ పరికరాలు కాలి పోయాయి. సకాలంలో మంటలు ఆర్పకుంటే దుకాణాలు దగ్ధమై తీవ్రమైన ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించి ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు.



ఎగిసిపడుతున్న మంటలు



అగ్నిప్రమాదంలో దగ్ధమైన కార్లు

పరిశ్రమ అగ్ని ప్రమాదంలో ఒకరి మృతి

- చికిత్స పొందుతూ ప్రాణాలొదిలిన కెమిస్ట్రీ టెక్నీషియన్
- పరిశ్రమ ఎదుట కుటుంబీకుల ఆందోళన
- దిగివచ్చిన పరిశ్రమ యాజమాన్యం
- రూ.45 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం హామీ
- మరో ముగ్గురి పరిస్థితి విషమం

7లో

ఏడుపాయల జాతరకు రూ.2 కోట్లు నిధులు

మెదక్/పాపన్నపేట, మార్చి 6 : ఏడుపాయల జాతరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తెలిపారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి, జాతర ఏర్పాట్లకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం రూ. 2కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చే జాతరకు నిధులు సమకూర్చాలని ప్రభుత్వాన్ని కోరగా.. తక్షణమే స్పందించి ప్రణాళికా విభాగం ప్రిన్సిపల్ కార్యదర్శి అహ్మద్ నదీన్ ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేశారని వివరించారు. మహాశివరాత్రి జాతర కోసం రూ.80 లక్షలతో భక్తులకు శాశ్వతషెడ్లు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని సూచించారు.

రైతునేస్తం ప్రారంభం



రైతునేస్తం వీడియోకాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

జిన్నారం, మార్చి 6: రైతు వేదికల వద్ద వారికి ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇచ్చేందుకు ఉద్దేశించిన 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని జిల్లాలో పలుచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. జిన్నారం మండలం సొలక్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పాల్గొన్నారు. తమ ప్రభుత్వం వ్యవసాయరంగం, రైతు సంక్షేమం కోసం చేపట్టనున్న కార్యక్రమాలను సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించారు. అంతకుముందు జిన్నారం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి ధరణి, రెవెన్యూ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. బాధితుల నుంచి ధరణి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమాల్లో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ స్వాతి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్ భిక్షపతి, డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు..



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నేతలు

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ ఆందోళనలు

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఆందోళనలు చేపట్టారు. సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్, మెదక్ నర్సాపూర్‌లో తదితర ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన ఆందోళనల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి పాల్గొన్నారు. సంగారెడ్డి కలెక్టర్ ఎదుట నిర్వహించిన ఆందోళనకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు.



మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గడంతో విక్టరీ సింబల్ చూపిస్తున్న కౌన్సిలర్లు, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

బీఆర్ఎస్ చేజారిన తూప్రాన్ బల్దియా పీఠం

- కేసీఆర్ ఇలాఖాలో నెగ్గిన అవిశ్వాసం
- వైస్ చైర్మన్‌కు తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు

7లో

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసిన టీఎన్జీవోలు

మెదక్ అర్బన్, మార్చి 6: జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన రాహుల్ రాజ్‌ను బుధవారం కలెక్టరేట్‌లో టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పాలనలో ఉద్యోగులందరూ సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనురాధ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఇక్బాల్‌పాష, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఫజులొద్దిన్, రఘునాథరావు, లీల, సంయుక్తకార్యదర్శి రాధ, విష్ణువర్ధన్‌రెడ్డి, మెదక్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శి రామాగౌడ్, శ్రీకాంత్, వైద్యఆరోగ్యశాఖ ఫోరం జిల్లా కార్యదర్శి మంజుల, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు ప్రధాన రోడ్డులో

అదుపు తప్పి కారు బోల్తా

● ఐదుగురికి గాయాలు

శంషాబాద్ రూరల్, మార్చి 6 : శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రధాన రోడ్డు (రోటరీ 1) వద్ద కారు అదుపు తప్పి బోల్తాపడగా ఐదుగురికి గాయలైన సంఘటన బుధవారం రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డికి చెందిన ఐదుగురు కారులో తమ బంధువులను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సెండాఫ్ చేసి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ఎయిర్‌పోర్టు ప్రధాన రోడ్డులో కారు అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో కారులో ఉన్న ఐదుగురికి స్వల్ప గాయలయ్యాయి. అయితే, ఎయిర్‌పోర్టు ప్రధాన రోడ్డు కావడంతో భారీగా ట్రాఫిక్ జామ్‌అయింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమాచారం అందుకున్న జీఎంఆర్ రక్షణ సిబ్బంది, స్థానిక ట్రాఫిక్ పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని కారును క్రేన్ సహాయంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మహిళలు ఉన్నతంగా ఎదగాలి

● సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్‌రావు



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి ప్రభాకర్‌రావు

సంగారెడ్డి క్రైమ్, మార్చి 6 : మహిళలందరూ ఉన్నతంగా ఎదగాలని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు ఆకాంక్షించారు. మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో మహిళలకు న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా, గృహహింస, పోక్సో వంటి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. మహిళలకు ఎలాంటి సమస్య ఎదురైనా సహాయం కోసం న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి జి.సుదర్శన్, రెండో అదనపు న్యాయాధికారి పి.కృష్ణార్జున, మూడో అదనపు జడ్జి సునీతా రవీందర్‌రెడ్డి, నాల్గో అదనపు జిల్లా జడ్జి ఎం.లావణ్య, సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్, న్యాయాధికారులు పి.లక్ష్మణ్‌చారి, శాలిని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో ఇంటర్ ప్రవేశానికి 10న రెండో లెవల్ పరీక్ష

నర్సాపూర్,మార్చి 6: గిరిజన గురుకులంలో ఇంటర్‌లో ప్రవేశానికి రెండో లెవల్ పరీక్షను 10న కామారెడ్డిలోని గిరిజన గురుకుల డిగ్రీ కాలేజీలో నిర్వహించనున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 10గంటలకు ప్రారంభం అవుతుందని విద్యార్థులు గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

మద్యం తాగి వాహనం నడిపిన యువకుడికి జైలు

రామాయంపేట, మార్చి 6 : పట్టణానికి చెందిన మర్కు సురేష్ మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. బుధవారం మెదక్ మొబైల్ కోర్టులో అతడిని హాజరుపరచగా జడ్జి కల్పన ఐదు రోజుల శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఇకనైనా మద్యం సేవించి వాహనాలు తోలవద్దని ఎస్ఐ రంజిత్ సూచించారు.

బీఆర్‌ఎస్ చేజారిన తూప్రాన్ బల్దియా పీఠం

● కేసీఆర్ ఇలాఖాలో నెగ్గిన అవిశ్వాసం

● వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్‌కు తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు



అవిశ్వాసం తీర్మానానికి మద్దతుగా చేతులెత్తిన ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, కౌన్సిలర్లు

తూప్రాన్, మార్చి 6 : మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ పట్టణ మున్సిపల్‌లో చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్‌పై ప్రవేశపెట్టిన అవిశాస తీర్మానం నెగ్గింది. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరి బీజేపీ మద్దతుతో బీఆర్‌ఎస్ పీఠాన్ని కదిలించారు. తూప్రాన్ పట్టణ మున్సిపల్ కార్యాలయంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తూప్రాన్ డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో తూప్రాన్, నర్సాపూర్ సీఐలు కృష్ణ, జాన్‌రెడ్డి, తూప్రాన్ ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు మామిండ్ల జ్యోతికృష్ణ, చెలిమెల ప్రియాంక, పల్లెర్ల జ్యోతి రవీందర్‌గుప్తా, జిన్న భగవాన్‌రెడ్డి, బాణాపురం రాజు, చింత రవీందర్‌రెడ్డి, జమాల్‌పురం లక్ష్మీబాయినర్సింజీ, రామునిగారి శ్రీశైలంగౌడ్, కొడిప్యాక నారాయణగుప్తా ఉదయం 11 గంటలకు పోలీసు రక్షణ మధ్య మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్‌లో సభ్యుడిగా నమోదు చేసుకున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మొదట ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కోరం సమకూరడంతో ఆర్డీవో జయచంద్రారెడ్డి మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం సమావేశాన్ని కొనసాగించారు. ఓటింగ్ కోరగా ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డితోపాటు, పది మంది కౌన్సిలర్లు మద్దతుగా చేతులు ఎత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఆర్డీవో జయచంద్రారెడ్డి ప్రకటించారు. వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్‌ను తాత్కాలిక చైర్మన్‌గా ఆర్డీవో జయచంద్రారెడ్డి ప్రకటించారు. అనంతరం ఆయనకు కమిషనర్ ఖాజా మొహిజుద్దీన్ సమక్షంలో ఆర్డీవో బాధ్యతలను అప్పగించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఎన్నికల కమిషన్‌కు తెలియజేసి మళ్లీ చైర్మన్ ఎన్నికకు తేదీ ఖరారు చేస్తామని ఆర్డీవో తెలిపారు. ఈ సమావేశానికి విలేకరులను అనుమతించలేదు.

చైర్మన్ వర్గం గైర్హాజరు

తూప్రాన్ మున్సిపాలిటీలో 16 వార్డులుండగా, బీఆర్‌ఎస్ 11, కాంగ్రెస్ ఇద్దరు, స్వతంత్రులు ఇద్దరు, బీజేపీ ఒక్కరు గెలుపొందారు. స్వతంత్రులు ఇద్దరు బీఆర్‌ఎస్‌లో చేరగా, బీఆర్‌ఎస్ ఒకటో వార్డు కౌన్సిలర్ బొంది రాఘవేందర్‌గౌడ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చైర్మన్‌ను సొంత పార్టీ కౌన్సిలర్లు మొదటి నుంచి వ్యతిరేకిస్తూ వచ్చారు. అప్పట్లో మంత్రి హరీశ్‌రావుకు ఫిర్యాదు చేశారు. చైర్మన్‌ను గద్దె దించేందుకు కౌన్సిలర్లు అదను కోసం చూశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్‌ఎస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య పదికి చేరింది. బీజేపీకి చెందిన కౌన్సిలర్ మద్దతుతో గతనెల 12న అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందజేశారు. చైర్మన్ రాఘవేందర్ గౌడ్‌కు నలుగురు కౌన్సిలర్ల మద్దతుతో వారి బలం ఐదుకు చేరింది. తరువాత రెండో వార్డుకు చెందిన కౌన్సిలర్ మామిడి వెంకటేశ్ మళ్లీ చైర్మన్ వర్గంలో చేరిపోయారు. దీంతో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఛాలెంజ్‌గా తీసుకొని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మద్దతు తీసుకున్నారు. సోమవారం ఆగమేఘాల మీద తూప్రాన్ మున్సిపల్‌లో రఘోత్తంరెడ్డిని ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా నమోదు చేయించారు. బుధవారం జరిగిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి చైర్మన్ వర్గం గైర్హాజర్ అయినప్పటికీ, ఎమ్మెల్సీతో కలిపి 11 మంది సభ్యులు హాజరు కావడంతో కోరం సమకూరింది.

తూప్రాన్ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చింది : మాజీ ఎమ్మెల్యే తూంకుంట

మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో రేపటి నుంచి తూప్రాన్ పట్టణ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చినట్టేనని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఇన్‌చార్జి చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులతో కలిసి బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన కేసీఆర్ ఒక్కసారి తూప్రాన్ రాలేదని, ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ఇలా వచ్చి అలా వెళ్లిపోయారని నర్సారెడ్డి మండిపడ్డారు. తూప్రాన్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు పెత్తనం పెరిగిపోయిందని ఆరోపించారు. దోచుకో.. దాచుకో అన్నట్లుగా వారి వ్యవహారం తయారైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి పాలన అందిస్తామని, ప్రజల సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. ప్రతీ ఒక్కరు చైర్మన్ అనేలా పాలన కొనసాగుతుందని నర్సారెడ్డి హామీ ఇచ్చారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నందాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈరోజు తూప్రాన్ ప్రజలకు శుభదినమన్నారు. అవినీతి పాలన చేసిన చైర్మన్‌ను దించేశామని సంతోషం వ్యక్తం చేశారు. మద్దతిచ్చిన ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తూప్రాన్ ప్రజలకు ఈరోజు దీపావళి పండుగని, ప్రజాపాలనను కొనసాగిస్తామన్నారు. తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బాణసంచాను పేల్చి సంబురాలు చేసుకున్నారు. కౌన్సిలర్లతోపాటు సర్పంచుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డి, పాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కావేరిగారి భగవాన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, నేత మహేందర్ రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, మానిక్‌రావు, కృష్ణ పాల్గొన్నారు.



తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

సమష్టి కృషితోనే మోదీ సభ విజయవంతం

● బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



మాట్లాడుతున్న సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, మార్చి 6 : పటాన్‌చెరు శివారులోని పటేల్‌గూడలో జరిగిన ప్రధాన మంత్రి విజయ సంకల్ప సభను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ధన్యవాదాలను తెలిపారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అందరి సమష్టి కృషి వల్లే మోదీ సభ విజయవంతమైందన్నారు. ప్రధాని సభ ఉందనే విషయాన్ని ఐదు రోజుల ముందే చెప్పారని, అయినప్పటికీ సభ విజయవంతం కోసం మహిళగా ధృడ సంకల్పంతో పనిచేశామన్నారు. మోదీ సభతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నిండిందన్నారు. మోదీ ప్రసంగంతో మళ్లీ ఓట్లు ఎప్పుడొస్తాయో, ఎప్పుడు బీజేపీకి ఓటు వేద్దామో అన్న ఉత్సాహంతో బీజేపీ శ్రేణులున్నాయన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేకపోయినా పది లక్షల కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. నలుగురు ఎంపీలుంటేనే అంత అభివృద్ధి జరిగిందంటే 17 స్థానాల్లో బీజేపీ గెలిస్తే రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. మోదీ ఆలోచనలు భవిష్యత్తు బాగుకు నిదర్శనమన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్, జహీరాబాద్ ఎంపీ స్థానాల గెలుపు కోసం అదే ఉత్సాహంతో కష్టపడి పనిచేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. మోదీ సభ సక్సెస్ కోసం సహకరించిన పోలీసు, ఇతర శాఖల అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నర్సింహారెడ్డి, అనంతరావు, రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి విజయ్, పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్ఐటీలో జాతీయస్థాయి 'ఈ బాజా'

● ఆయా రాష్ట్రాల నుంచి పాల్గొనున్న 70 టీంలు

● ఎలక్ట్రిక్ వాహనాల ప్రదర్శన

● 11 వరకు కొనసాగనున్న పోటీలు



ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సంస్థల ప్రతినిధులు

నర్సాపూర్, మార్చి 6: మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీలో జాతీయస్థాయి ఈ బాజా ఈవెంట్ బుధవారం ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలోనే మొదటిసారి తెలంగాణ రాష్ట్రంలో, మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీలో నిర్వహిస్తుండటం విశేషం. దేశంలోని ఆయా ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన మొత్తం 70 టీంలు పాల్గొంటుండగా ఒక్కో టీంలో 25 మంది విద్యార్థులు ఉంటారని నిర్వాహకులు తెలిపారు. రూ.4 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు చేసి విద్యార్థులు స్వయంగా రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను ఈ బాజాలో ప్రదర్శించి తమ ప్రతిభ చాటనున్నారు. బుధవారం నుంచి ఈ నెల 11 వరకు పోటీలు కొనసాగనున్నాయి. ఇందులో ప్రతిభ చాటిన వారికి ప్రముఖ సంస్థలలో ప్లేస్‌మెంట్ కల్పించి ప్రోత్సహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధి సంజయ్‌నిబంధే, రెనాల్ట్ నిస్సాన్ టెక్ ప్రతినిధి సంస్థ హీరోటెక్ హరడా, భారత్ పెట్రోలియం సంస్థ రాష్ట్ర ప్రతినిధి అచమ్‌ట్రిహన్, కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే తదితరులు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం వరకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోగా గురువారం నుంచి పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 8వ తేదీన మహిళ దినోత్సవం సందర్భంగా కేవలం విద్యార్థినులే తీర్చిదిద్దిన ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విష్ణు ఎడ్యుకేషనల్ చైర్మన్ విష్ణురాజు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ తమ కళాశాల జాతీయస్థాయి పోటీలకు వేదిక కావడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు ప్రతిభ చాటి మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



పోటీలలో పాల్గొననున్న విద్యార్థులతో ప్రతినిధులు

కోవాలంట్ పరిశ్రమ అగ్ని ప్రమాదంలో ఒకరి మృతి

● చికిత్స పొందుతూ ప్రాణాలొదిలిన కెమిస్ట్రీ టెక్నీషియన్

● పరిశ్రమ ఎదుట మృతుడి కుటుంబీకుల ఆందోళన

● సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయింపు

● దిగివచ్చిన పరిశ్రమ యాజమాన్యం

● రూ.45 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం హామీ

● మరో ముగ్గురి పరిస్థితి విషమయం



వినోద్‌కుమార్



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

హత్నూర, మార్చి 6 : హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూరు శివారులోని కోవాలంట్ ల్యాబోరేటరీస్ పరిశ్రమలో మంగళవారం సాయంత్రం సంభవించిన అగ్నిప్రమాదంలో నలుగురు గాయాలపాలవగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అందులో ఒకరు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రమైన హత్నూర గ్రామానికి చెందిన నీరుడి వినోద్‌కుమార్ కోవాలంట్ పరిశ్రమలో కొంతకాలంగా కెమిస్ట్రీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. రోజువారి మాదిరిగానే మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు విధుల్లోకి వెళ్లాడు. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-4లో వినోద్‌కుమార్‌తో పాటు ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కాంట్రాక్టు కార్మికులు స్వాదిన్‌రాజమల్, లైబాబు తుర్రై, ఫాదర్ మరండి విధులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో ఏఎన్ఎఫ్‌డీ రియాక్టర్ నుంచి మెటీరియల్ ఖాళీ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విధుల్లో ఉన్న నలుగురికి మంటలంటుకోవడంతో కేకలు వేశారు. వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు సేఫ్టీ పరికరాలను ఉపయోగించి మంటలను అదుపు చేశారు. అప్పటికే తీవ్ర గాయాలైన నలుగురిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కెమిస్ట్రీ టెక్నీషియన్ వినోద్‌కుమార్(27) అర్ధరాత్రి మృతి చెందాడు. కాంట్రాక్టు కార్మికులు ముగ్గురు ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వినోద్‌కుమార్‌కు తల్లిదండ్రులతో పాటు భార్య వీరమణి, ఆరు నెలల బాలుడు ఉన్నారు. వినోద్‌కుమార్ కుటుంబసభ్యులు, బంధువులు బుధవారం పరిశ్రమ ఎదుట ఆందోళన నిర్వహించారు. సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం దిగిరాగా మృతుడి బంధువులతో పలు దఫాలుగా చర్చలు జరిపి రూ.45లక్షల నష్టపరిహారం, ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. హత్నూర తహసీల్దార్ ఫర్హీన్ షేక్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రవీణ్‌కుమార్, జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ సుభాష్ పరిశ్రమను సందర్శించి, ఘటనకు గల కారణాలను పరిశ్రమ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు పరిశ్రమపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

కేసీఆర్ ఓఎస్డీగా ముత్యంరెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలను స్వీకరించిన ముత్యంరెడ్డి

గజ్వేల్, మార్చి 6: బీఆర్‌ఎస్‌ఎల్పీ నేతగా ఎన్నికైన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓఎస్డీగా ముత్యంరెడ్డి బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఐదేళ్లపాటు గడ ప్రత్యేకాధికారిగా పనిచేసిన ముత్యంరెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో బాధ్యతలను చేపట్టగా తాజాగా గజ్వేల్ క్యాంపు కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి శుక్రవారం వరకు గజ్వేల్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆయనను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్లు సత్కరించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థి



అజయ్

కోహీర్, మార్చి 6: మండలంలోని దిగ్వాల్ గ్రామ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బి.అజయ్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గోవర్ధన్‌రావు తెలిపారు. రెండు నెలల క్రితం జిల్లాస్థాయికి ఎంపికైన అజయ్ మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. నెలరోజుల క్రితం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు ఖేలో ఇండియా పేరుతో హైదరాబాద్‌లోని బాలయోగి స్టేడియంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీలో అజయ్ ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా అజయ్‌ని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

మద్యం మత్తులో ఇద్దరి మధ్య ఘర్షణ రాయితో కొట్టి ఒకరి హత్య

● పరారీలో నిందితుడు



యాదయ్య(ఫైల్)

జిన్నారం, మార్చి 5: బొల్లారం మున్సిపాలిటీలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రాథమిక వివరాల ప్రకారం.. గచ్చిబౌలి ఖాజాగూడకు చెందిన యాదయ్య(38) కొంతకాలం క్రితం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీరప్పబస్తికి తరలివచ్చి నివాసం ఉంటున్నాడు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బొల్లారం ప్రధాన రహదారి సమీపంలో యాదయ్య తనకు పరిచయస్థుడైన మార్ల రాజుతో మంగళవారం రాత్రి మద్యం తాగారు. మద్యం మత్తులో వారిద్దరూ ఘర్షణ పడ్డారు. ఈ గొడవలో రాజు యాదయ్యను రాయితో మోదగా మృతిచెందాడు. ఘటన స్థలాన్ని జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ సందర్శించి కేసు నమోదు చేశారు. కాగా నిందితుడు రాజు పరారీలో ఉండడంతో ఘర్షణకు కారణాలు తెలియరాలేదు. యాదయ్యకు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

సీఎంఆర్ ధాన్యం దుర్వినియోగం చేసిన మిల్లర్లపై కేసులు

● రూ.49 కోట్ల ధాన్యం స్వాహా

● ఇప్పటికే నలుగురిపై క్రిమినల్ కేసుల నమోదు

మెదక్, మార్చి 6 : కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కోసం కేటాయించిన ధాన్యం దుర్వినియోగం చేసిన మిల్లర్లపై సివిల్ సప్లయ్ అధికారులు క్రిమినల్ కేసులను నమోదు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 21 రైస్‌మిల్లర్లు రూ.49.75 కోట్ల ధాన్యం స్వాహా చేసినట్లు అధికారులు గుర్తించారు. రికవరీ చట్టం ప్రకారం వారు తీసుకున్న ధాన్యం విలువను డబ్బు రూపంలో పౌరసరఫరాల శాఖ అకౌంట్‌లో జమచేయాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి 13 మిల్లులపై చర్యలు తీసుకోనున్నట్లు పెడుతున్నట్లు తెలిపారు. అందులో నలుగురు మిల్లర్లపై క్రిమినల్ కేసులయ్యాయి. ఇందులో భవానీ రైస్‌మిల్, శారదా ట్రేడర్స్, చాముండేశ్వరీ రైస్‌మిల్, సాయికృప రైస్‌మిల్లుల యజమానులపై కేసులు నమోదు చేశారు. మిగతా తొమ్మిది మిల్లులపై నేడో, రేపో క్రిమినల్ కేసులు పెట్టడానికి సిద్ధం చేస్తున్నారు. వారు తక్కువ మొత్తంలో బకాయిలు ఉండడంతో అధికారులు దూకుడుగా వ్యవహరించడం లేదు. రూ.59 లక్షల లోపే ధాన్యం డబ్బు ఉండడం, పైగా ఆ డబ్బు జమ చేసే యత్నంలో ఉన్నట్లు సమాచారం.

లక్ష్యం పూర్తి చేయని మిల్లర్లను వదిలేది లేదు

మెదక్ జిల్లాలో లక్ష్యం మేరకు సీఎంఆర్ ఇవ్వని 21 రైస్‌మిల్లుల జాబితా తయారుచేశాం. వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేయనున్నాం. ఇప్పటివరకు నలుగురిపై ఆర్ఆర్ యాక్టు కింద కేసులు పెట్టాం. ఇప్పటికిప్పుడు మరో 9 మందిపై క్రిమినల్ కేసులు పెడతాం. డబ్బు కట్టడానికి ముందుకు వచ్చే మిల్లర్లను వదిలిపెడతాం.

- హరికృష్ణ, సివిల్ సప్లయ్ డీఎం

రూ.28.03 కోట్లతో ఖేడ్ మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మార్చి 6: నారాయణఖేడ్ మున్సిపాలిటీకి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.28.03 కోట్లతో అంచనా బడ్జెట్‌కు బుధవారం నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. మున్సిపాలిటీకి పన్నుల రాబడి ద్వారా రూ.2.96 కోట్లు, పన్నేతర రాబడి ద్వారా రూ.3.75 కోట్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంట్ల ద్వారా రూ.21.23 కోట్లు, ఇతర డిపాజిట్ల ద్వారా వచ్చే రూ.8.50 లక్షలతో కలిపి రూ.28.03 కోట్లుగా అంచనా వేసి ఆమోదించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, పారిశుధ్యం నిర్వహణ, విద్యుత్ చార్జీలు, రుణ వాయిదాల చెల్లింపులు, హరితహారం కోసం రూ.3.92 కోట్లు, ఇంజనీరింగ్, సాధారణ పరిపాలన, టౌన్‌ప్లానింగ్ కోసం రూ.96 లక్షలు మిగులు బడ్జెట్ కేటాయింపు రూ.61 లక్షలు, ప్రజల సౌకర్యం కోసం రూ.20 లక్షలు, వార్డుల అభివృద్ధి కోసం రూ.1.02 కోట్లు, కేటాయించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ దారం శంకర్‌గుప్తా, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ మేనేజర్ వెంకటశివయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బల్దియా అంచనా రూ.5107 కోట్లు

జోగిపేట, మార్చి 6: అందోలు-జోగిపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్ హాజరయ్యారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ.5107 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టగా కౌన్సిలర్ ఆమోదం తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.50.88 కోట్లు వ్యయాన్ని అంచనా చేశారు.

గెలిచేదెవరో.. ఓడేదెవరో..!

● సంగారెడ్డి మున్సిపాలిటీలో అవిశ్వాసంపై ఉత్కంఠ ● నేడు సమావేశం

సంగారెడ్డి టౌన్, మార్చి 6: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై నేడు (గురువారం) కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి భవితవ్యం తేలనున్నది. ఈ అవిశ్వాసంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. నెలరోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలకు నేడు తెరపడనున్నది. బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవిపై అదే పార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసులు అందజేసిన విషయం అందరికీ తెలిసిందే. ఈ నెల 7న అవిశ్వాసంపై బలాబలాలను తేల్చుకునేందుకు అధికారులు సమావేశాన్ని నిర్వహించనున్నారు. దీంతో వారంరోజులుగా కౌన్సిలర్లు విహారయాత్రకు వెళ్లారు. సమావేశానికి సరిపోను మెజార్టీ కౌన్సిలర్లు హాజరుపరిచేందుకు చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న 22వ కౌన్సిలర్ మంజులతానాగరాజు ప్రయత్నిస్తున్నారు. ఈ సమావేశానికి మెజార్టీ కౌన్సిలర్లు గైర్హాజరై.. అవిశ్వాసం వీగిపోయేలా చైర్‌పర్సన్ విజయలక్ష్మి కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం, బీఆర్ఎస్‌లకు చెందిన పలువురు కౌన్సిలర్లను విహారయాత్రకు తరలించిన విషయం తెలిసిందే. మున్సిపల్‌లో మొత్తం 37 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాసం నెగ్గాలంటే 26 మంది కౌన్సిలర్ల మద్దతు కావాలి. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసాన్ని నెగ్గేందుకు అవసరమైన 26 మంది కౌన్సిలర్ల మద్దతు తమకు ఉన్నదని నక్క మంజులతానాగరాజు ధీమాను వ్యక్తం చేస్తుండగా... అవిశ్వాసం వీగిపోతుందనే ధీమాలో చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి ఉన్నారు. ఆమె ఇప్పటికే 20మంది కౌన్సిలర్లను విహారయాత్రకు తరలించారు. వారందరూ అవిశ్వాస తీర్మానం కోసం జరిగే సమావేశానికి గైర్హాజరు కానున్నట్లు తెలిసింది. ఈ అవిశ్వాసంతో చైర్‌పర్సన్ భవితవ్యం తేలనున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం

నేడు వావిలాల పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస సమావేశం

జిన్నారం, మార్చి 6: నేడు వావిలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాస సమావేశం జరుగనున్నది. ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్లు, బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్ శంకర్‌రెడ్డిపై అవిశ్వాస నోటీసు అందజేశారు. మొత్తం 13మంది డైరెక్టర్లు ఉండగా.. నేటి సమావేశానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సైకిల్ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి



మహ్మద్ హుస్సేన్(ఫైల్)

వెల్దుర్తి, మార్చి 6: ప్రమాదవశాత్తు సైకిల్ పైనుంచి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. వెల్దుర్తి గ్రామానికి చెందిన మహ్మద్ హుస్సేన్(67) మంగళవారం సాయంత్రం పొలం వద్దకెళ్లి రాత్రయినా రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికానా ఆచూకీ తెలియలేదు. బుధవారం ఉదయం వెల్దుర్తి గ్రామ శివారులో రోడ్డు పక్కన మహ్మద్ హుస్సేన్ మృతిచెంది ఉండడాన్ని గమనించిన వాహనదారులు కుటుంబసభ్యులకు తెలిపారు. మండల పరిధిలోని మేల్లూరు నుంచి వెల్దుర్తి వైపు సైకిల్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన జారిపడి మృతిచెందినట్లుగా భావిస్తున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవతగౌడ్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన నర్సాగౌడ్

కౌడిపల్లి, మార్చి 6: బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కౌడిపల్లి మండల పరిధిలోని వెల్మకన్నె శివారులో బుధవారం చోటు చేసుకున్నది. మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన పోచన్‌పల్లి నర్సాగౌడ్ కౌడిపల్లిలోని ఓ రైస్ మిల్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం వెల్మకన్నె ప్రకృతి నివాసానికి సమీపంలోని రోడ్డు పక్కన బైక్ అదుపు తప్పి కిందపడి అపస్మారక స్థితిలోకి పోయాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది అతడిని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలిని మోసం చేసి భూమి కాజేసేందుకు యత్నం

● ఫీల్డ్ అసిస్టెంట్‌పై కేసు

శివ్వంపేట, మార్చి 6: శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రాములు గ్రామానికే చెందిన ఓ వృద్ధురాలి భూమిని కాజేసేందుకు ఆమె వేలిముద్రలు తీసుకుని యత్నించాడు. ఈ విషయం బయటపడడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన రాయెల్లి సులోచన గతంలో రెండు ఎకరాల పట్టాభూమి విక్రయించగా ఇంకో ఎకరా అసైన్డ్ భూమి రోడ్డుకు ఆనుకుని ఉన్నది. కొందరు దీనిని కాజేయాలని ప్రణాళిక రూపొందించి గృహజ్యోతి దరఖాస్తులో పొరపాటు ఉన్నదని సంతకం చేస్తే పథకం వర్తిస్తుందని ఫీల్డ్ ఆఫీసర్ కుల్ల రాములు సులోచనకు పలుమార్లు పలుమార్లు ఫోన్ చేశాడు. ఈ విషయం ఆమె కుమారుడు శ్రీనివాస్‌కు చెప్పింది. ఇద్దరూ కలిసి పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేస్తున్న క్రమంలో వాటితో పాటు గుట్టుచప్పుడు కాకుండా భూమి విక్రయం, లీజు ఇచ్చినట్లు రాసుకున్న బాండ్లపై సులోచన వేలిముద్రలు వేయిస్తుండగా శ్రీనివాస్‌కు అనుమానం వచ్చి గృహజ్యోతి పథకానికి బాండ్ ఎందుకని తల్లిని ఆపాడు. వెంటనే ఆ పత్రాలను తీసుకుని మండల కేంద్రమైన శివ్వంపేటలోని మండల పరిషత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. దీంతో సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

కొల్చారం/నర్సాపూర్/రాయికోడ్/జహీరాబాద్/కొండాపూర్/రామాయంపేట, మార్చి 6: ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే మండల కేంద్రమైన కొల్చారం రైతువేదిక నుంచి జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కలెక్టర్ రాహుల్‌రాజుకు జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహ్మద్ గఫర్ మియా, ఎంపీడీవో లక్ష్మీ నర్సింహులు, ఎంపీపీ మంజులా కాశీనాథ్, రైతులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 110 రైతువేదికల్లో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఏర్పాటుచేసిన రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించగా.. అందులో నర్సాపూర్, కొల్చారం కూడా ఉండడంతో ప్రారంభోత్సవంలో పలువురు పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఎంపీపీ జ్యోతి సురేష్‌నాయక్ మాట్లాడారు. రాయికోడ్ డివిజన్ పరిధిలోని వట్‌పల్లి, మునిపల్లి, రాయికోడ్ మండలాలకు చెందిన రైతులు రైతునేస్తంలో పాల్గొన్నారు. ఎంపీపీ అధ్యక్షుడు సిర్గాపూర్ మొగులప్ప, పీఏసీఎస్ చైర్మన్‌నాగ్ శెట్టిపాటిల్, పాల్గొన్నారు. జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామంలోని రైతువేదికలో రైతునేస్తంలో పాల్గొని సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. కొండాపూర్ రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా రైతులు సీఎం ప్రసంగించిన అంశాలను శ్రద్ధగా విన్నారు. రైతునేస్తం కార్యక్రమాన్ని రామాయంపేట పట్టణంలోని రైతువేదికలో రైతులు వీక్షించారు.



కొల్చారం రైతువేదిక నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ రాజ్

వేసవిలో తాగునీటి సమస్యపై దృష్టి పెట్టండి: ఎమ్మెల్యే

మనూరు, మార్చి 6: వేసవి కాలంలో మండలంలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు దృష్టి పెట్టాలని ఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షురాలు కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిమ్యాల్ గ్రామంలో తాగుటిటి సమస్య వస్తున్నదని సభదృష్టికి తీసుకురాగా... ఎమ్మెల్యే జోక్యం చేసుకొని వేసవిలో ఏ గ్రామంలో కానీ, తండాల్లో కానీ తాగునీటి సమస్య రావొద్దని సూచించారు. అనంతరం మండల కేంద్రమైన మనూరు పలు కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లు కావాలని కార్యదర్శి సభ దృష్టికి తీసుకురాగా, ట్రాన్స్‌కో ఏఈ అశోక్‌రెడ్డి స్పందిస్తూ డీడీలు చెల్లించాలని తెలిపారు. ఈ విషయంలో జోక్యం చేసుకున్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పాలకులు వేసిన వెంచర్లలో ప్రభుత్వ విద్యుత్ స్తంభాలు, వైర్లు వేసి ప్రజాధనం వృధా చేసి పేదలను ఇబ్బందులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హైమద్ హుస్సేన్, తహసీల్దార్ వెంకటస్వామి, వైద్యాధికారి నర్సింగ్‌చౌహాన్, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవోలు హన్నాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు మనూరులో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

పదవీ కాలం పూర్తవుతున్నా.. పరిష్కారం కాని సమస్యలు

● సర్వసభ్య సమావేశంలో సభ్యుల గగ్గోలు

పుల్‌కల్, మార్చి 6: ఐదేళ్ల పదవీ కాలం పూర్తవుతున్నా.. గ్రామాల్లో సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని ఎంపీటీసీలు మండిపడ్డారు. పుల్కల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షురాలు పట్లోళ్ల చైతన్యావిజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. సమస్యలు పరిష్కారానికి తమను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటే వారి కనీస వసతులు తీర్చడంలో విఫలమయ్యామని ఎంపీటీసీలు కలాలి కిరణ్‌గౌడ్, నాయకుని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో ఆనందమేరి స్పందిస్తూ గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి ఆయాశాఖల అధికారులు చొరవ తీసుకునేలా చూస్తామని హామీఇచ్చారు. శివంపేటలో పశు వైద్యాధికారి లేకపోవడంతో పశువులకు టీకాలు వేయడంలేదని కిరణ్‌గౌడ్ ఆరోపించారు. పశు వైద్యాధికారి డాక్టర్ దీపాంకర్ పాల్ స్పందిస్తూ ఉమ్మడి పుల్కల్ మండలానికి తానొక్కడినే పశు వైద్యాధికారిగా ఉన్నానని, ఇంకా నాలుగైదు చోట్ల డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.



సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ చైతన్యరెడ్డి, ఎంపీడీవో ఆనందమేరి

సర్పంచుల సేవలు మరువలేనివి

గ్రామపంచాయతీల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్రదారులని ఎంపీపీ పట్లోళ్ల చైతన్యావిజయభాస్కర్ రెడ్డి అన్నారు. తాజా మాజీ సర్పంచులకు రైతువేదిక భవనంలో వీడ్కోలు సభ నిర్వహించారు. మండలంలోని 34 మంది సర్పంచులను శాలువా, పూలమాలలతో సత్కరించి, మెమొంటోలను అందజేశారు. ఇక్కడ ఎంపీడీవోలుగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఎం.మధులత, ఎస్‌పీ.జయలక్ష్మిని, ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఆనందమేరిని సన్మానించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నారాయణఖేడ్, మార్చి 6: విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. బుధవారం సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో ఖేడ్ నియోజకవర్గంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు బంజారా ఉద్యోగుల సేవాసమితి సంఘం ఆధ్వర్యంలో పెన్నులు, పరీక్షల ప్యాడ్లను అందజేసి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీపీ.రాథోడ్, పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి గుండు లక్ష్మణ్, ఎంఈవోలు విశ్వనాథ్, శంకర్, మన్మథకిషోర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం చట్టాలు

● న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి రూరల్, మార్చి 6: మహిళల రక్షణ కోసం చట్టాలు ఉన్నాయని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. సంగారెడ్డిలోని మెడ్విన్ సంస్థ కార్యాలయంలో గృహ కార్మికులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు చట్టాల పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్లే హింసలకు గురవుతున్నారన్నారు. గృహహింస చట్టమ డయల్ 100, షీటీమ్, సఖీ, నిర్భయ, భరోసా కేంద్రాలు మహిళలకు అండగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మెడ్విన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, సంస్థ కో ఆర్డినేటర్ స్వప్న, ముజీబ్, గృహకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నాపత్రాలు

వెల్దుర్తి, మార్చి 6: పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన మెదటి సెట్ ప్రశ్నాపత్రాలు బుధవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. రూట్ ఆఫీసర్, శివ్వంపేట ఎంఈవో బుచ్యానాయక్, సహాయక రూట్ ఆఫీసర్ సామ్యనాయక్ వెల్దుర్తి సూపరింటెండెంట్ సీతారాం, కుకునూర్ సూపరింటెండెంట్ సాంబయ్యకు పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను, ఇతర సామగ్రిని అందజేశారు. ప్రశ్నాపత్రాలను సబ్జెక్ట్ వారిగా బాక్స్‌ల్లో పెట్టి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఈనెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్నాయని, వెల్దుర్తి మండలంలో రెండు, తూప్రాన్ మండలంలో ఏడు, శివ్వంపేట మండలంలో 4 పరీక్షా కేంద్రాలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఆయా పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచినట్లు రూట్ అధికారి, శివ్వంపేట ఎంఈవో బుచ్యానాయక్ తెలిపారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్

మెదక్ అర్బన్, మార్చి 6: పార్లమెంట్ ఎన్నికలలోపే మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డా. కొండ దేవయ్య పటేల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పిట్లంబేస్ సంఘ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు బట్టి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో మున్నూరుకాపులు 60 లక్షల వరకు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు తమ సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదన్నారు. జనాభా ప్రాతిపదికన పార్లమెంట్, వచ్చే సంస్థ ఎన్నికలతోపాటు కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో మున్నూరుకాపులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎండీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవి, దేశెట్టిశివ, యువక మండలి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళ కమిటీ జిల్లా అధ్యక్షురాలు సబితారవీందర్, నాగరాణి, జర్నలిస్టుఫోరం జిల్లా అధ్యక్షులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

కంది, మార్చి 6: కంది మండల పరిధిలోని కవలంపేటలో ఉన్న అలివేలుమంగా పద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి 16వ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు జయంత్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి నిత్యాభిషేకాలు, పుష్పార్చనలు, సహస్ర కలశాభిషేకాలు, మహిళలచే కుంకుమార్చనలు, గణపతి పూజ, రుద్ర, సుదర్శన హోమాలు శాస్త్రోత్సవంగా జరిపారు. ఈ కల్యాణోత్సవానికి భక్తులు వేలాదిగా తరలి వచ్చి పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ, స్వామివారికి వెండిపూలతో ఊయల సేవ, గ్రామ పురవీధుల్లో ఊరేగింపు, పల్లకీ సేవా, దీపారాధన, విష్ణుసహస్రనామ పారాయణం, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ షఫీబాబా పాల్గొన్నారు.

'రెండురోజుల్లో దుకాణాలు ఖాళీ చేయాలి'

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 6: పాతబస్టాండ్ వద్ద గల మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాదారులు ఖాళీ చేయాలని మున్సిపల్ సిబ్బంది వెళ్లగా వారు మొండికేశారు. వారంరోజుల క్రితం 17 దుకాణాలకుగాను రీటెండర్ వేసిన విషయం విదితమే. ఈ మేరకు ఖాళీ చేయాలని నోటీసులిచ్చినా ఎవరూ స్పందించకపోవడంతో బుధవారం మున్సిపల్ సిబ్బంది దుకాణాలు ఖాళీ చేయించేందుకు అక్కడికి వెళ్లారు. ఒక్కసారిగా ఎలా ఖాళీ చేయాలంటూ దుకాణాదారులు ఎదురు తిరగడంతో మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్ వెళ్లి వారితో మాట్లాడారు. కొంతసేపు ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినా.. వేలం వేసిన దుకాణాల్లో ఎలా కొనసాగుతారని ప్రశ్నించారు. ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, అయినా ఖాళీ చేయకపోతే ఎలా అన్నారు. వెంటనే ఉన్నపలంగా దుకాణాలకు సిబ్బందిచే తాళం వేయించారు. స్పందించిన దుకాణాదారులు మరో రెండురోజులు సమయం ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు.

మాట తప్పడమే కాంగ్రెస్ నైజం: ఎమ్మెల్యే



ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్, మార్చి 6: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను ఎన్నికల తరువాత మాట తప్పడమే కాంగ్రెస్ నైజమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ముందు ఆ పార్టీ నేతలు ప్లకార్డులతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల నుంచి రూ.20 కోట్లు దోచుకునేందుకు కాంగ్రెస్ తెరలేపిందని విమర్శించారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

●మెదక్ మున్సిపాలిటీ: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ కొండంత హామీలిచ్చి.. ఇప్పుడు గోరంత కూడా అమలు చేయడం లేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఎల్ఆర్ఎస్ పథకాన్ని పూర్తిగా ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ధర్నాలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, ఎంపీపీ యమున, మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

●నారాయణఖేడ్: లేఅవుట్లు, లేఅవుట్లలోని ప్లాట్లను చార్జీలు వసూలు చేయకుండా ఉచితంగా క్రమబద్ధీకరించాలని మాజీ మెమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ చార్జీలను వసూలు చేయాలనే ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ ఖేడ్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు పరమేశ్వర్, జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

●నర్సాపూర్: ఎల్ఆర్ఎస్ ప్రజలపై భారంగా ఉన్నదని, దానిని తొలగించి ఉచితంగానే భూములను క్రమబద్ధీకరించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం ఎల్ఆర్ఎస్‌పై నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో సునీతారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, జడ్పీ కో ఆప్షన్ మన్సూర్ పాల్గొన్నారు.

●జహీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలో ఎల్ఆర్ఎస్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఆర్డీవోకు రాజుకు వినతిపత్రం అందజేశారు.

రైతు రుణమాఫీ ఏమైంది?: మాజీ ఎమ్మెల్యే

చిన్నశంకరంపేట, మార్చి 6: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ ఏమైందని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం చిన్నశంకరంపేట మండలంలోని గవ్వపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద వాటర్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. నామమాత్రంగా పథకాలను అమలు చేస్తున్నదని ఆరోపించారు. అనంతరం కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాధవీరాజు, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, రైతుబంధు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

అందరూ భక్తి మార్గంలో నడుచుకోవాలి



ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సురేష్‌కుమార్‌షెట్కార్

న్యాల్‌కల్, మార్చి 6: ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడుచుకోవాలని మాజీ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ పేర్కొన్నారు. బుధవారం న్యాల్‌కల్ మండలం కాకిజనవాడ గ్రామంలో గల మల్లన్న ఆలయంలో శివలింగం పునఃప్రతిష్ఠాపనక హాజరై మాట్లాడారు. భక్తిమార్గంతో నడుచుకోవడం వల్ల మానసిక ప్రశాంతతతోపాటు, ఆయూరారోగ్యంగా ఉంటామన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శివలింగాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

అల్లాదుర్గం, మార్చి 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తున్న చేసుకున్న లబ్ధిదారులు జీరో కరెంటు బిల్లు వర్తించని వారు ప్రజాపాలన సేవా కేంద్రంలో తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శంకర్‌యాదవ్ తెలిపారు. స్త్రీశక్తి భవన్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గృహజ్యోతి పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న కొందరికి జీరో విద్యుత్ బిల్లు రావడం లేదని వస్తున్న ఫిర్యాదుల మేరకు అర్హత కలిగిన వారు తెల్లరేషన్ కార్డు, కరెంటు బిల్లు, గ్యాస్ బుక్కు, ప్రజాపాలన దరఖాస్తు రశీదు జిరాక్సు ప్రతులతో తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతుల శ్రేయస్సు కోసం కృషి: ఏఎంసీ డైరెక్టర్

జహీరాబాద్, మార్చి 6: రైతుల శ్రేయస్సుకోసం కృషి చేస్తానని ఏఎంసీ డైరెక్టర్ నరేష్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రంజోల్ శివారులో గల బాబానగర్ గ్రామస్థులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఎంసీ డైరెక్టర్‌గా ఎన్నికైన తాను రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్‌దళ్ జిల్లా నాయకుడు రవికుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా చూడాలి'

కోహీర్, మార్చి 6: నర్సరీలలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీవో భారతి, ఏపీవో సునందరావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కోహీర్‌లోని ఎంపీపీ కార్యాలయంలో ఆయా గ్రామాల ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. గతంలో ప్రధాన రహదారులకు ఇరువైపుల నాటిన మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించి కాపాడాలని తెలిపారు.

సిద్ధేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా దారం వెంకట్

కంగ్టి, మార్చి 6: దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న కంగ్టి సిద్ధేశ్వర ఆలయం చైర్మన్‌గా దారం వెంకట్‌ను నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు బుధవారం నూతనంగా ఎన్నికైన చైర్మన్ వెంకట్‌తో పాటు పాలక మండలి సభ్యులు చెన్ బసప్ప, భూమారెడ్డి, అంజన్న, పవన్‌గౌడ్, హన్మంతు, జైకిషన్ మహరాజ్‌తో అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్, ఈవో శివరుద్రప్పలు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సాగర్ షెట్కార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సర్దార్, మనోజ్ పాటిల్, చందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, నాగన్న, నర్సింహులు పాల్గొన్నారు. అంతకుముందు నూతన పాలకమండలి సభ్యులను చంద్రశేఖర్‌రెడ్డి సన్మానించారు.

పెన్నార్ పరిశ్రమలో బీఆర్‌టీయూ ఘన విజయం

పటాన్‌చెరు, మార్చి 6: పటాన్‌చెరు పారిశ్రామికవాడలో హోరాహోరీగా సాగిన అధికార యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ ఐక్య కూటమిపై బీఆర్‌టీయూ ఘన విజయం సాధించింది. బీఆర్‌టీయూ తరఫున ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ అధ్యక్షుడిగా నిలబడ్డారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మద్దతుతో బరిలో నిలిచిన ఆయన తిరుగులేని విజయం సాధించారు. అనంతరం బీఆర్‌టీయూ నాయకులు, కార్మికులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రెండోసారి పెన్నార్ ఎన్నికల్లో గెలుపొందడం కార్మికుల ఐక్యతకు నిదర్శనమన్నారు.

మక్కరాజ్‌పేట ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్

చేగుంట, మార్చి 6: మక్కరాజ్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. మాక్ పోలింగ్ ఎన్నికల నిర్వహణను జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన కల్పించడం కోసమే మాక్ పోలింగ్ నిర్వహించామన్నారు. జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంపీడీవో చిన్నారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు అమర్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ బండి కవితావిశ్వేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.